# భారతదేశ చరిత్ర

## మౌర్యవంశం – సాంస్కృతిక అంశాలు

భారతదేశ చరిత్ర - సంస్కృతి అభివృద్ధికి మౌర్యులు ఎనలేని కృషి చేశారు. వీరి కాలంలో భాష, సాహిత్యాలు, విద్యాసారస్వతాల వికాసంతోపాటు వాస్తు కళారంగాల అభివృద్ధికి విశేష సేవ చేశారు. భారతదేశంలో తొలి శాసన సాహిత్యం అశోకుడి శాసనాలే. సంస్కృతం, పాళీ, గ్రీకు భాషల్లో అనేక రచనలు చేశారు. భారతదేశ వాస్తుకు మౌర్యుల కాలంలోనే పునాది పడిందని చెప్పవచ్చు.

### విద్యాసారస్వతాల అభివృద్ధి

మౌర్యుల కాలంలో విద్యాసారస్వతాల అభివృద్ధికి ఎన్నో చర్యలు చేపట్టారు. నాడు తక్షశిల ప్రధాన విశ్వవిద్యాలయంగా ఉండేది. ఇది భారతదేశంలో అతి ప్రాచీన విశ్వవిద్యాలయం. మౌర్యుల కాలంలో ఇక్కడ విదేశీ వస్తువులు విరివిగా లభించేవి. అశోకుడి శాసనాలు బ్రాహ్మీ, ఖరోష్ఠి లిపిలో ఉండేవి. సామాన్య ప్రజలు కూడా సులభంగా అర్థం చేసుకునే రీతిలో అశోకుడు శాసనాలను వేయించాడు. నాటి ప్రముఖ రచనల్లో కౌటిల్యుడి అర్థశాస్త్రం ఒకటి. దీన్ని సంస్కృతంలో రాశారు. మౌర్యుల పరిపాలనకు ప్రధాన ఆధార గ్రంథమైన అర్థశాస్త్రంలో మొత్తం 15 భాగాలు ఉన్నాయి. ప్రొఫెసర్ శ్యామశాస్త్రి ఈ గ్రంథాన్ని గుర్తించి ఆంగ్లంలోకి అనువదించారు. చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానానికి వచ్చిన గ్రీకు రాయబారి మెగస్తనీస్ 'ఇండికా' అనే గ్రంథాన్ని రాశాడు. మౌర్యుల కాలం నాటి సాంఘిక పరిస్థితులకు ప్రధాన ఆధార గ్రంథంగా ఇండికాను చెప్పవచ్చు. భద్రబాహుడి కల్పసూత్రాలు కూడా వీరి కాలంలోనే రాశారు. క్రీ.పూ. 250లో అశోకుడు పాటలీపుత్రంలో మూడో బౌద్ధ సంగీతిని నిర్వహించాడు. ఈ సమావేశంలోనే అభిదమ్మ పీటకాన్ని సంకలనం చేశారు. ఈ విధంగా మౌర్యుల కాలంలో దేశీయ, విదేశీ సాహిత్యం; బౌద్ధ సాహిత్యం అభివృద్ధి చెందాయి. ప్రాకృత, సంస్కృత భాషలతోపాటు గ్రీకు భాషలో కూడా సాహిత్య సృష్టి జరిగింది.

### వాస్తు, కళారంగాలు

భారతదేశంలో లలితకళల చరిత్ర మౌర్యులతోనే ప్రారంభమైందని చెప్పవచ్చు. వీరు మొదట్లో రాజప్రాసాదాలను చెక్కతో నిర్మించేవారు. ఇలాంటి రాజప్రాసాదం ఒకటి పాట్నాలో బయల్పడింది. తర్వాతి దశలో చైత్యాలు, స్తూపాలు, ఏకరాతి స్తంభాలను రాళ్లతో నిర్మించారు. పర్షియా, గ్రీకు కళాకారుల నైపుణ్యాలను తమ నిర్మాణాల్లో ఉపయోగించుకున్నారు. నాడు భారతీయ, గ్రీకు కళాకారులకు బాక్ట్రియా ప్రధాన ఉమ్మడి కేంద్రంగా ఉండేది. మౌర్య పాలకులు తమ కట్టడాల్లో ఎక్కువగా గోధుమ వర్ణపు రాయిని ఉపయోగించేవారు. గృహ వేదికల నిర్మాణానికి మాత్రం గ్రానైట్ రాయిని వాడేవారు. మౌర్యుల కాలం నాటి వాస్తు, కళారంగాల అభివృద్ధి నాటి శాసనాలు, రాజప్రాసాదాలు, గుహలు, స్తూపాలు, చైత్యాలతోపాటు అశోకుడి ఏకరాతి స్తంభాల్లో కనిపిస్తుంది. అశోకుడి రాతి స్తంభాలను శాసనాలున్న (అలహాబాద్, సాంచి, సారనాథ్, దిల్లీ, మీరట్, రుమ్మిందై), శాసనాలు లేని (గ్వాలియర్, రామ్‌పూర్వా) రాతి స్తంభాలుగా వర్గీకరించారు. ఇవి సాంకేతికంగా, శిల్పకళా నైపుణ్యపరంగా ఉన్నత స్థాయికి చెందినవిగా వి.ఎ.స్మిత్ అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు. రాతి స్తంభపు పునాది రాళ్లపై నెమలి బొమ్మలు, రాతి స్తంభంపై గల ఫలకం చుట్టూ పువ్వులు, పక్షులు, జంతువుల బొమ్మలు చెక్కారు. సారనాథ్ స్తంభంపై నాలుగు సింహాల శిఖరం (సింహతలాటం) ఉంది. దీన్ని భారత జాతీయ చిహ్నంగా తీసుకున్నారు. స్తంభ ఫలకంపై సింహం, ఏనుగు, వృషభం, అశ్వాలు నాలుగు దిక్కులను రక్షిస్తున్నట్లు ఉన్నాయి. ఇందులో ఏనుగు తూర్పు, ఎద్దు పశ్చిమ, సింహం ఉత్తర, గుర్రం దక్షిణ దిక్కులను సూచిస్తున్నాయి. వీటి మధ్య ధర్మచక్రాన్ని చెక్కారు.

అశోకుడి రామ్‌పూర్వా స్తంభంలోని వృషభ శిఖరం, రుమ్మిందై స్తంభ శాసనంలో అశ్వ శిఖరం, లౌరియా నందన్‌ఘర్ స్తంభ శాసనంలో సింహ శిఖరాలను ఆకర్షణీయంగా చెక్కారు. స్తంభంలోని తల భాగంలో జంతువుల బొమ్మలు, ధర్మచక్రంతోపాటు తలకిందులుగా ఉన్న పద్మం ఉంది. స్తంభంపై భాగాన్ని మెరిసేలా తీర్చిదిద్దారు. మౌర్యుల కాలం నాటి కళా రంగాన్ని డాక్టర్ కుమారస్వామి అనే కళా విమర్శకుడు ఆస్థాన కళ, జనప్రియ కళలుగా పేర్కొన్నాడు. మౌర్యుల వాస్తు నిర్మాణాల్లో గుహలు కూడా ఉన్నాయి. అశోకుడు, అతడి మనువడు దశరథుడు బుద్ధగయ వద్ద ఉన్న బరాబర్ కొండల్లో గుహలను నిర్మించి అజీవక మతస్థులకు దానం చేశారు. ముఖ్యంగా సుదామ, లోమాస్‌రుషి గుహల్లో దారునిర్మిత వాస్తుకళా ప్రభావం కనిపిస్తుంది. రాతిని తొలిచి గుహలను నిర్మించే పద్ధతికి బరాబర్ గుహలే ప్రథమ ఉదాహరణ. నాటి రాజ భవనాల నిర్మాణంలో గొప్ప వాస్తురీతి కనిపిస్తుంది. పాటలీపుత్రం లోని రాజసౌధాలు, దర్బారులను అద్భుతంగా నిర్మించారు. చైనా యాత్రికుడు ఫాహియాన్ ఈ నిర్మాణాల గొప్పతనాన్ని కొనియాడాడు. వీరి వాస్తు సంపదలో స్తూపాలు కూడా ప్రధానమైనవి. అశోకుడు తన పరిపాలనా కాలంలో సుమారు 84 వేల స్తూపాలను నిర్మించినట్లు తెలుస్తోంది. స్తూపం అనేది బుద్ధుడి అస్థికలపై నిర్మించిన పొడవాటి స్తంభం. స్తూపాలను ఇటుకలు, రాళ్లతో నిర్మించారు. దీనిపై ఛత్రం కూడా ఉంటుంది. సాంచీ స్తూపం అశోకుడు నిర్మించిన వాటిలో ప్రధానమైంది. ఇది మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉంది. దీన్ని ఇటుకలతో

నిర్మించారు. సారనాథ్, బార్హూత్ స్తూపాలపై ఉన్న శిల్ప సంపద మౌర్యుల కాలం నాటి వాస్తు, కళారంగాల గొప్పతనాన్ని తెలియజేస్తుంది. నిర్మాణాల్లో రాయిని వినియోగించడం అనేది అశోకుడి కాలం నుంచే ప్రారంభమైంది. ఒరిస్సాలోని దౌళి వద్ద శిల నుంచి ఏనుగు బయటకు వస్తున్నట్లుగా చెక్కారు.

### టెర్రాకోటా వస్తువులు

మౌర్యుల కాలం నాటి గుహలు, రాతి స్తంభాలు, శాసనాలు, రాజప్రాసాదాలు, స్తూపాలతోపాటు నాటి టెర్రాకోటా వస్తువులు కూడా వారి సాంస్కృతిక వికాసాన్ని తెలియజేస్తాయి. ముఖ్యంగా అహిచ్ఛత్ర ప్రాంతంలో లభించిన మట్టిపాత్రలు వారి నైపుణ్యానికి నిదర్శనం. తక్షశిల ప్రాంతంలోని తవ్వకాల్లో నాలుగు బంగారు గాజులు లభించాయి. విగ్రహాలు, ప్రతిమలు, ఆభరణాలు, పూసలు లాంటి ఎన్నో వస్తువులు నాటి కళావైభవాన్ని తెలియజేస్తున్నాయి. బొమ్మల్లో చక్రాలు అమర్చిన జంతువుల బొమ్మలు అధికంగా ఉన్నాయి. నాడు ఏనుగు చాలా ఇష్టమైన జంతువుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఫణ (వెండి నాణెం), కర్షాపణ (రాగి నాణెం) నాణేలు వాడుకలో ఉన్నాయి.

### ఇతర అంశాలు

మౌర్యుల కాలం నాటి రాతి స్తంభాల్లో మూడు ముఖ్య భాగాలుండేవి.

1) స్తంభం కింద అడుగుభాగం (శిలా వేదిక) - నెమళ్ల బొమ్మలు చెక్కేవారు

2) స్తంభ నిడువాటి మధ్య భాగం

3) స్తంభం తలభాగం - జంతువుల బొమ్మలు, ధర్మచక్రం, పద్మం చెక్కేవారు

★ స్తంభాల తయారీ కోసం ఎర్రటి చుక్కలున్న తెల్లరాయిని మధుర నుంచి, నలుపు చుక్కలున్న ఇసుక రాయిని చూనార్ నుంచి తీసుకొచ్చేవారు. మౌర్యుల కాలం నాటి యక్షిణి రాతి శిల్పం దిదార్‌గంజ్ వద్ద లభించింది.

★ మెగస్తనీస్ ఇండికా గ్రంథంలో పాలిబోత్ర (పాటలీపుత్ర) నగర వర్ణన ఉంది. ఈ నగరం తొమ్మిది మైళ్ల పొడవు, ఒకటిన్నర మైళ్ల వెడల్పుతో ఉందని దాని చుట్టూ ఉన్న కందకంలోకి సోన్ నది నీరు వస్తుందని మెగస్తనీస్ పేర్కొన్నాడు.

★ పాటలీపుత్ర నగరం పుష్పాలకు, విజ్ఞానానికి, సంపదకు, లలిత కళలకు నిలయమని సోమదేవుడు కథాసరిత్సాగరం గ్రంథంలో పేర్కొన్నాడు. ఈ నగరంలోని భవనాలు ప్రపంచంలో అతి సుందరమైన సుసా, ఎగ్‌బటానాల కంటే గొప్పగా ఉన్నాయని ఫాహియాన్ తెలిపాడు.

★ మౌర్యుల కాలం నాటి స్త్రీ గూఢచారులను సత్రిన్‌లు, మహిళా కళాకారులను గనికులు అని పిలిచేవారు.

★ బిందుసారుడి చరిత్రను తెలిపే 'మూలకల్ప' గ్రంథాన్ని ఆర్యమంజుశ్రీ రచించారు. బిందుసారుడి కాలంలో తక్షశిలలో ప్రజా తిరుగుబాటు జరిగింది. ఈయన పెద్ద కుమారుడు సుమన నాటి తక్షశిల గవర్నర్‌గా ఉండేవాడు. తక్షశిల తిరుగుబాటును అణచివేయడానికి బిందుసారుడు అశోకుడిని పంపించాడు. అనంతరం అతడినే తక్షశిల గవర్నర్‌గా నియమించారు. అశోకుడు తన మంత్రి రాధాగుప్తుడి సహాయంతో చక్రవర్తి అయినట్లు పేర్కొన్నారు.

★ మౌర్యుల కాలంలో 18 రకాల చేతివృత్తులు, పరిశ్రమలు ఉన్నాయని బౌద్ధ జాతక కథలు పేర్కొంటున్నాయి.

★ నాటి సంచార వర్తక శ్రేణిని పుగ, దాని అధిపతిని సార్థవాహ అని పిలిచేవారు.

★ బిందుసారుడి కాలంలో ఖల్లాటకుడు మంత్రిగా పనిచేశాడు. రాజు సొంత భూముల ఆదాయాన్ని వసూలు చేసే అధికారిని సీతాధ్యక్షుడు; సత్రాలు, బావులను పర్యవేక్షించే అధికారులను వచభూమికులు అని పిలిచేవారు.

★ అలెగ్జాండర్ మరణం తర్వాత అతడి గవర్నర్‌లను చంద్రగుప్త మౌర్యుడు ఓడించాడని 'జస్టిన్' అనే గ్రీకు చరిత్రకారుడు రాశాడు.

★ నందవంశ పాలకుల దుష్పరిపాలన గురించి అలెగ్జాండర్‌కు చంద్రగుప్త మౌర్యుడే చెప్పాడని తర్వాత అతడు సెల్యూకస్ నికేటర్‌ను ఓడించి 500 ఏనుగులను బహుకరించినట్లు ప్లూటార్క్ పేర్కొన్నాడు. సెల్యూకస్ నికేటర్ కుమార్తె హెలెన్‌ను చంద్రగుప్త మౌర్యుడు వివాహం చేసుకున్నట్లు అప్పియన్ అనే గ్రీకు రచయిత తెలిపాడు.

★ చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానానికి గ్రీకు రాయబారి మెగస్తనీస్ వచ్చినట్లు అథనేపియన్ అనే చరిత్రకారుడు మౌర్యుల సైన్యంలో 6 లక్షల పదాతి దళం, 30 వేల అశ్విక దళం, 9 వేల గజ దళం, 1000 రథాలు ఉన్నట్లు ప్లీని పేర్కొన్నాడు.

★ మహావంశం అనే బౌద్ధ గ్రంథంలో చంద్రగుప్త మౌర్యుడు క్షత్రియుడని పేర్కొన్నారు. పిప్పలి వనంలో మౌర్యులు అనే క్షత్రియ తెగ ఉన్నట్లు దిఘనికాయ అనే బౌద్ధ రచనలో ఉంది. జేమ్స్ ప్రిన్సెప్ (1837 - 38) బ్రాహ్మీ లిపిని కనుక్కొని పరిష్కరించాడు.

**రచయిత: బొత్స నాగరాజు**